### హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో ప్రవేశాలకు
## దరఖాస్తు చేసుకోవాలి

**వికారాబాద్ కలెక్టర్ నారాయణరెడ్డి**



వికారాబాద్, ఫిబ్రవరి 24 : హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ బేగంపేట్‌లో 1వ తరగతి ప్రవేశం కోసం అర్హులైన షెడ్యూల్డ్ కులాల విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని వికారాబాద్ కలెక్టర్ నారాయణరెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు వికారాబాద్ జిల్లాకు చెందిన వారై ఉండాలని, ఒక కుటుంబంలో ఒక విద్యార్థికి మాత్రమే ప్రవేశం కల్పించడం జరుగుతుందని తెలిపారు. జిల్లాకు 2 సీట్లు కేటాయించడం జరిగిందన్నారు. గ్రామీణ షెడ్యూల్డ్ కులాలవారి వార్షిక ఆదాయం రూ.1.50 లక్షలు, పట్టణ ప్రాంతాలవారి వార్షిక ఆదాయం రూ.2 లక్షలకు మించకుండా ఉండాలన్నారు. 01.06.2017 నుంచి 31.05.2018 మధ్య జన్మించినవారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తు ఫారాలు జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి కార్యాలయం రూం నం.ఎఫ్-10 వికారాబాద్ కలెక్టర్ కార్యాలయంలో పొందాలన్నారు. పూర్తి చేయబడిన నిర్ణీత దరఖాస్తు ఫారాలను మార్చి 12 లోపు ధ్రువపత్రాలతో సమర్పించాలని కలెక్టర్ తెలిపారు. పూర్తి వివరాలకు 9573859268ను సంప్రదించాలన్నారు.

### పాలిటెక్నిక్ కళాశాలల్లో ప్రవేశాల కోసం దరఖాస్తులు

వికారాబాద్, ఫిబ్రవరి 24 : రాష్ట్రంలో పాలిటెక్నిక్ కళాశాలల్లో ప్రవేశాల కోసం నిర్వహించే పాలీసెట్ 2024 పరీక్ష ఆన్‌లైన దరఖాస్తులు ఫిబ్రవరి 15 నుంచి ఏప్రిల్ 22 వరకు స్వీకరించబడతాయని వికారాబాద్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ పరమేశ్వర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు రుసుం ఎస్సీ, ఎస్టీలు రూ.250, ఇతరులు రూ.500 చెల్లించి polycet.sbtet.telangana.gov.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. గడువు తేదీ ముగిసిన తరువాత, ఏప్రిల్ 24 వరకు రూ.100 అపరాధ రుసుం చెల్లించి దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. స్థానిక గవర్నమెంట్ పాలిటెక్నిక్ వికారాబాద్ కళాశాలలో సివిల్ ఇంజినీరింగ్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్, ఎలక్ట్రానిక్స్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ సంబంధించి ఒక్కొక్క విభాగంలో 60 సీట్లు ఉన్నాయన్నారు.

## గంజాయి విక్రయిస్తున్న ఇంజినీరింగ్ విద్యార్థి అరెస్టు

మొయినాబాద్, ఫిబ్రవరి 24 : నగరం నుంచి గంజాయి ప్యాకెట్‌లను తీసుకొచ్చి విక్రయిస్తున్న ఓ విద్యార్థితో పాటు గంజాయి కొంటున్న ఓ యువకుడిని ఎస్‌వోటీ పోలీసులు పట్టుకున్నారు. ఈ సంఘటన మొయినాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. వికారాబాద్ జిల్లా పూడూరు మండలానికి చెందిన భరత్ మొయినాబాద్‌లో ఉంటూ ఓ కళాశాలలో ఇంజినీరింగ్ చదువుతున్నాడు. గత కొంతకాలంగా గంజాయికి అలవాటు పడి ఇటీవల సప్లయర్‌గా కూడా మారాడు. శుక్రవారం సాయంత్రం నగరంలోని నానక్‌రామ్‌గూడ నుంచి 200 గ్రాముల గంజాయి ప్యాకెట్లు తీసుకుని బైక్‌పై మొయినాబాద్ మండల పరిధిలోని అజీజ్‌నగర్ చౌరస్తాలో ఉన్న ఓ కళాశాల వద్దకు వచ్చాడు. ఓ కళాశాలలో సెక్యూరిటీ గార్డ్‌గా పని చేస్తున్న అలీమ్ గంజాయి కొన్నాడు. అదే సమయంలో రాజేంద్రనగర్ జోన్ ఎస్‌వోటీ పోలీసులు పక్కా సమాచారంతో ఇద్దరిని పట్టుకున్నారు. వారి వద్ద ఉన్న 40 గ్రాముల చొప్పున ఉన్న 5 గంజాయి ప్యాకెట్లు, బైక్, సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరు యువకులతో పాటు స్వాధీనం చేసుకున్న గంజాయిని మొయినాబాద్ పోలీసులకు అప్పగించారు. కేసు నమోదు చేసిన పోలీసులు నిందితులను శనివారం రిమాండ్‌కు తరలించారు.



సభా స్థలానికి సంబంధించి అధికారుల నుంచి వివరాలు సేకరిస్తున్న కలెక్టర్ శశాంక

# బహిరంగ స్థల పరిశీలన

**వివరాలు సేకరించిన రంగారెడ్డి కలెక్టర్ శశాంక, సైబరాబాద్ సీపీ అవినాశ్ మహంతి**

చేవెళ్లటౌన్, ఫిబ్రవరి 24 : ఈ నెల 27న చేవెళ్లలోని ఫరా ఇంజినీరింగ్ కళాశాల వద్ద కాంగ్రెస్ ప్రభుత్వం భారీ బహిరంగ సభ నిర్వహించనున్నది. ఈ సభకు సంబంధించిన ఏర్పాట్లు, స్థలాన్ని శనివారం రంగారెడ్డి కలెక్టర్ శశాంక, సైబరాబాద్ సీపీ అవినాశ్ మహంతి, రాజేంద్రనగర్ డీసీపీ శ్రీనివాస్, చేవెళ్ల ఏసీపీ కిషన్ బాబు వేర్వేరుగా అధికారులతో కలిసి పరిశీలించారు. సభ స్థలంలోనే ఉన్న హెలికాప్టర్ ల్యాండింగ్ స్థలాన్ని వారు పరిశీలించారు. అనంతరం సీపీ సభ స్టేజీ, కళాకారుల స్టేజీ, వీవీపీ, వీవీఐపీ, మీడియా పాయింట్‌తో పాటు సభకు వచ్చే పబ్లిక్, వీవీపీ పార్కింగ్, బస్సు, కార్ల పార్కింగ్‌పై చర్చించారు. దీంతోపాటు జనం తరలింపు, స్టేజీ కెపాసిటీ తదితర అంశాలపై కూడా చర్చించారు. సభ ఏర్పాట్లు తొందరగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఆర్‌అండ్‌బీ శాఖ డీఈ వెంకటేశ్వర్‌రావు, చేవెళ్ల ఆర్డీవో సాయిరాం, తహసీల్దార్ కృష్ణయ్య, ఆర్‌ఐ రాజేశ్, సీఐ లక్ష్మారెడ్డి, విద్యుత్ ఏడీఈ స్వామి, సిబ్బంది ఉన్నారు.



సభా స్థలాన్ని పరిశీలిస్తున్న సైబరాబాద్ సీపీ అవినాశ్ మహంతి

# సీఎంఆర్ లక్ష్యాలను పూర్తి చేయని రైస్ మిల్లర్లపై చర్యలు

**వికారాబాద్ జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్**

వికారాబాద్, ఫిబ్రవరి 24 : ప్రభుత్వం నిర్దేశించిన గడువు ఈ నెల 29 లోగా సీఎంఆర్ లక్ష్యాలను పూర్తి చేయనట్లయితే రైస్ మిల్లర్లపై చర్యలు తప్పవని జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ హెచ్చరించారు. శనివారం కలెక్టరేట్‌లోని అదనపు కలెక్టర్ చాంబర్‌లో రైస్ మిల్లర్లు, పౌరసరఫరాల అధికారులతో సీఎంఆర్ పెండింగ్ ఉన్న మిల్లర్ల యజమానులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. ఖరీఫ్, రబీ 2022-23 సంవత్సరానికి సంబంధించి రైతుల నుంచి కొనుగోలు చేసిన వరి ధాన్యాన్ని వేగవంతంగా మిల్లింగ్ చేసి నెలాఖరులోగా నిర్దేశిత కోటాను భారత ఆహార సంస్థకు చేరవేయాలని మిల్లర్లకు సూచించారు. నిబంధనలను ఉల్లంఘించే రైస్ మిల్లర్లపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సీఎంఆర్ కేటాయింపుల్లో నెలలు గడుస్తున్నా మిల్లర్లు అలసత్వాన్ని ప్రదర్శిస్తున్నారని మండిపడ్డారు. జాప్యాన్ని ప్రభుత్వం తీవ్రంగా పరిగణిస్తున్నదని, మిల్లర్ల అలసత్వాన్ని ఉపేక్షించబోమని స్పష్టం చేశారు. సీఎంఆర్ కేటాయింపులపై మిల్లర్లతో ఆయన కూలంకషంగా చర్చించారు. సమావేశంలో జిల్లా పౌరసరఫరాల అధికారి రాజేశ్వర్, పౌరసరఫరాల మేనేజర్ సుగుణ, రైస్ మిల్లర్ల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బాలేశ్వర్ గుప్తా, పౌరసరఫరాల డిప్యూటీ తహసీల్దార్లు, మిల్లర్లు పాల్గొన్నారు.



రైస్ మిల్లర్లతో సమావేశం నిర్వహించిన జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్

# 24 గంటల్లో హత్య కేసు ఛేదన

- నలుగురు నిందితులకు రిమాండ్
- పోలీసులను అభినందించిన సీపీ అవినాశ్ మహంతి

చేవెళ్ల రూరల్, ఫిబ్రవరి 24 : చేవెళ్ల మండల పరిధి ఆలూర్ గ్రామంలోని విద్యుత్ సబ్ స్టేషన్‌లో ఆపరేటర్‌గా విధులు నిర్వహిస్తున్న హర్యానాయక్‌ను గురువారం అర్ధరాత్రి నేపాల్‌కు చెందిన నలుగురు వ్యక్తులు బండరాళ్లతో తలపై మోదీ అతి దారుణంగా హత్యచేసిన ఘటనలో శుక్రవారం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కేసు నమోదు చేసిన 24 గంటల్లోనే పోలీసులు దర్యాప్తును వేగవంతం చేసి శనివారం నిందితులను అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించారు. ఈ సందర్భంగా సీఐ లక్ష్మారెడ్డి, ఎస్‌ఐలు ప్రదీప్‌కుమార్, బ్రహ్మం శనివారం పోలీస్‌స్టేషన్‌లో నిందితులను హాజరుపర్చి వివరాలు వెల్లడించారు. ఆలూర్ గ్రామంలో చిన్నూ ఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌లో మాస్టర్‌గా పనిచేసే నేపాల్‌కు చెందిన సాగర్ అనే వ్యక్తి వద్దకు వారి స్నేహితులు బినోద్ తప, రమేశ్ దమి, ఉమేశ్ భగవాన్‌జీ ఈ నెల 21న కలవడానికి వచ్చి అక్కడే ఉండి రాత్రి సమయంలో విద్యుత్ సబ్ స్టేషన్‌లో నిద్రపోవడానికి గ్రామానికి చెందిన శ్రీనివాస్ అనే వ్యక్తితో ఆపరేటర్‌కు చెప్పించి నిద్రించారని తెలిపారు. మరుసటి రోజు 22న గురువారం కూడా మధ్యాహ్నం వరకు ఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌లో పని చేసి, రాత్రి సమయంలో మద్యం తాగి మళ్లీ సబ్‌స్టేషన్‌లో నిద్రించడానికి వెళ్లడంతో అందుకు ఆపరేటర్ హర్యానాయక్ ఒప్పుకోకపోవడంతో వాగ్వాదం జరిగిందన్నారు. అనంతరం మద్యం మత్తులో విచక్షణారహితంగా హర్యానాయక్ తలపై బండరాళ్లతో మోదీ హత్య చేశారని, అనంతరం మృతుడి సెల్‌ఫోన్, సబ్‌స్టేషన్ సెల్‌ఫోన్‌ను సైతం తీసుకొని పరారయ్యారని తెలిపారు. కేసు నమోదు చేసి నిందితులను రిమాండ్‌కు తరలించామని పోలీసులు తెలిపారు.

24 గంటల్లో ఆలూర్ హత్య కేసును ఛేదించిన చేవెళ్ల పోలీసులు ఏసీపీ సీఐ లక్ష్మారెడ్డి, ఎస్‌ఐలు ప్రదీప్‌కుమార్, బ్రహ్మంలను సైబరాబాద్ సీపీ అవినాశ్ మహంతి, రాజేంద్రనగర్ డీసీపీ శ్రీనివాస్ ప్రత్యేకంగా అభినందించారు.



పోలీసుల అదుపులో నిందితులు

## అక్రమ వెంచర్‌లు, నిర్మాణాలపై ఉక్కుపాదం

**వెంచర్ రోడ్లు, విద్యుత్ స్తంభాలను కూల్చిన అధికారులు**

మొయినాబాద్, ఫిబ్రవరి 24 : జీవో 111 పరిధిలో ఎలాంటి నిర్మాణాలు చేపట్టరాదని, ఎలాంటి వెంచర్లు చేయరాదని ఉన్న నిబంధనలను తుంగలో తొక్కి అక్రమ దందాకు తెరలేపుతున్నారని ఫిర్యాదుల వచ్చాయి. ఈ నేపథ్యంలో మండల పరిధిలోని కనకమామిడి గ్రామ రెవెన్యూలో వెలుస్తున్న అక్రమ నిర్మాణాలు, వెంచర్లపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశాలు జారీ చేయడంతో శనివారం మొయినాబాద్ తహసీల్దార్ గౌతంకుమార్ నేతృత్వంలో పంచాయతీ అధికారులు, ఇరిగేషన్ అధికారులు చర్యలకు పూనుకున్నారు.

కనకమామిడి రెవెన్యూలో ఓ ఇన్‌ఫ్రా డెవలపర్స్ సంస్థ 70 ఎకరాల్లో జీవో 111కు విరుద్ధంగా చేసిన వెంచర్‌ను అధికారులు సందర్శించారు. వెంచర్‌లోని రోడ్లను కూల్చడంతో పాటు అందులో వేసిన విద్యుత్ స్తంభాలను జేసీబీల సహాయంతో విరగ్గొట్టారు. అంతేకాకుండా ప్రభుత్వ భూమి పక్కనే వెంచర్ వెలువడంతో ప్రభుత్వ భూమిని ఎక్కడైనా కలుపుకొని కబ్జా చేశారనే కోణంలో సర్వే కూడా నిర్వహించారు. వెంచర్‌లో సహజ సిద్ధమైన వాగులు, వంకలు ఏమన్నా కబ్జాకు గురయ్యాయా అని పరిశీలించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ గౌతమ్‌కుమార్ మాట్లాడుతూ.. నిబంధనలకు విరుద్ధంగా ఎలాంటి అక్రమ పనులు చేపట్టినా చర్యలు తప్పవని హెచ్చరించారు. వెంచర్‌లో ప్రభుత్వ భూమి ఉన్నట్లు తేలితే వెంటనే స్వాధీనపర్చుకుంటామని చెప్పారు. వాగులు, వంకలు వెంచర్‌లో కబ్జాకు గురైతే వాటిని ఎలా ఉంటే అలానే వదిలిపెట్టేలా ఇరిగేషన్ అధికారులు చర్యలు తీసుకుంటారని తెలిపారు. కార్యక్రమంలో కనకమామిడి గ్రామ ప్రత్యేక అధికారి లక్ష్మి, ఇరిగేషన్ ఏఈ ప్రియాంక, ఆర్ఐ చంద్రమోహన్, పంచాయతీ కార్యదర్శి సుదర్శన్, ఇరిగేషన్ వర్క్ ఇన్‌స్పెక్టర్ నర్సింహులు పాల్గొన్నారు.



కనకమామిడిలో వెంచర్‌లో వేసిన రోడ్లను ధ్వంసం చేయిస్తున్న అధికారులు

### ప్రేమ పేరుతో బాలుడి వేధింపులు
# ఉరేసుకొని బాలిక ఆత్మహత్య

యాచారం, ఫిబ్రవరి 24 : ప్రేమ కాటుకు అభం శుభం తెలియని ఓ బాలిక నిండు ప్రాణాలు కోల్పోయింది. ఇంట్లో ఫ్యానుకు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ సంఘటన హైదరాబాద్ గ్రీన్ ఫార్మా సిటీ పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం రాత్రి జరిగింది. ఎస్సై నరేశ్ కథనం ప్రకారం.. కందుకూరు మండలం ఆకుల మైలారం గ్రామానికి చెందిన ఓ బాలిక (14) మీర్‌ఖాన్‌పేట గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదోతరగతి చదువుతున్నది. మీర్‌ఖాన్‌పేట గ్రామానికి చెందిన ఓ బాలుడు (14) గత ఆరు నెలలుగా ప్రేమ పేరుతో బాలికను వేధిస్తున్నాడు. అతడి వేధింపులు రోజురోజుకూ మితిమీరిపోవడంతో తట్టుకోలేక మనస్తాపానికి గురైంది. బాలిక చివరకు ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు చీరతో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. ఉదయం పొలం పనులకు వెళ్లి సాయంత్రం ఇంటికొచ్చిన తల్లి ఇంట్లో తన కూతురు ఉరేసుకొని ఉండటాన్ని చూసి ఒక్కసారిగా షాక్‌కు గురైంది. విషయాన్ని ఫోన్ ద్వారా భర్తకు తెలిపింది. కండ్ల ముందే ఒక్కగానొక్క కూతురు చనిపోవడంతో బోరున విలపించారు.

తన కూతురు ఆ బాలుడి వేధింపులతోనే బలవన్మరణానికి పాల్పడిందని తండ్రి తెలిపాడు. గత ఆరు నెలలుగా ప్రేమిస్తున్నానంటూ తన కూతురు వెంట పడేవాడని వాపోయాడు. అతడి వేధింపులతో తన కూతురు చదువుకు తీవ్ర భంగం కలిగినట్లు తెలిపాడు. ఈ విషయం కూతురు తమతో తెలుపడంతో గతంలో పలుమార్లు బాలుడిని మందలించినప్పటికీ అతడు మారలేదని పేర్కొన్నాడు. తన స్నేహితుడితో కలిసి తన ఇంటి చుట్టూ తిరగడం ప్రారంభించాడని వాపోయాడు. పైగా ఇటీవల ఇన్‌స్టాగ్రామ్ వేదికగా మెసేజ్‌లు పెడుతూ, అసభ్యకరమైన పోస్టులు పెడుతూ అతడి స్నేహితుడితో కలిసి వేధించినట్లు తెలిపాడు. నిత్యం పాఠశాలలో, బయట, ఫోన్‌లో ప్రేమ పేరుతో వేధించడంతోనే తన కూతురు ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పదో తరగతి పరీక్షలు దగ్గర పడటం, ప్రేమ వేధింపులు అధికమవడంతో తన కూతురు మానసిక క్షోభకు గురై ఆత్మహత్య చేసుకున్నట్లు ఆవేదన వ్యక్తం చేశాడు. తన కూతురు మరణానికి కారణమైన నిందితులను కఠినంగా శిక్షించాలని కోరాడు. తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## పుడమితల్లిని రక్షించుకునే బాధ్యత ప్రతి ఒక్కరిది

- కౌన్సిల్ గ్రీన్ రెవెల్యూషన్ సంస్థ వ్యవస్థాపకురాలు కోర్పోలు లీలమ్మ
- లీడ్ ఎర్త్ లీడర్స్‌పై మూడు రోజుల శిక్షణా తరగతులు
- పాల్గొన్న మహబూబ్‌నగర్, రంగారెడ్డి, నారాయణపేట్ జిల్లాల విద్యార్థులు



ఎర్త్ సెంటర్‌లో నిర్వహించిన శిక్షణా తరగతుల్లో మాట్లాడుతున్న సీజీఆర్ వ్యవస్థాపకురాలు లీలమ్మ

కడ్తాల్, ఫిబ్రవరి 24 : పుడమితల్లిని రక్షించుకునే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉన్నదని కౌన్సిల్ గ్రీన్ రెవెల్యూషన్ సంస్థ వ్యవస్థాపకురాలు కోర్పోలు లీలమ్మ అన్నారు. మండల పరిధిలోని అన్మాస్‌పల్లి గ్రామంలోని ఎర్త్ సెంటర్‌లో తెలంగాణ విద్యాశాఖ-సీజీఆర్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న లీడ్ ఎర్త్ లీడర్స్ మూడు రోజుల శిక్షణా తరగతుల్లో మహబూబ్‌నగర్, రంగారెడ్డి, నారాయణపేట్ జిల్లాలకు చెందిన 130 మంది విద్యార్థులు పాల్గొన్నారు. శనివారం నిర్వహించిన శిక్షణా తరగతులకు హాజరైన విద్యార్థులనుద్దేశించి లీలమ్మ మాట్లాడారు. భూమాత సంరక్షణకు ఎన్ని ఒడిదుడుకులు ఎదురైనా పట్టు విడువకుండా దృఢ నిశ్చయంతో ముందుకెళ్లాలని సూచించారు. భూమిపై తాపాన్ని తగ్గించేందుకు, ఆరోగ్యకరమైన వాతావరణానికి ప్రతిఒక్కరూ విధిగా మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. విరివిగా మొక్కలు నాటడంతో భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన వాతావరణాన్ని అందించవచ్చని తెలిపారు. విద్యార్థి దశ నుంచే సమాజంపై అవగాహన పెంపొందించుకోవాలని తెలిపారు. తల్లిదండ్రులను, విద్యాబుద్ధులను నేర్పిన గురువులను గౌరవించాలని వివరించారు.

కార్యక్రమంలో సేంద్రియ, సహజ వ్యవసాయం నిపుణురాలు స్నేహ, శాస్త్రవేత్తలు హరిసర్వోత్తమన్న, శ్రీదేవి, వర్ధన్‌రెడ్డి, ఉమామహేశ్వర్‌రెడ్డి, సీజీఆర్ వ్యవస్థాపకుడు లక్ష్మారెడ్డి, బాల చైతన్య కేంద్రాల నిర్వాహకుడు రజనీకాంత్, మహబూబ్‌నగర్ జిల్లా సైన్స్ అధికారి శ్రీనివాసులు, నారాయణపేట్ అధికారి భానుప్రకాశ్, ఎస్‌సీఈఆర్‌టీ సభ్యులు వెంకట్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, రమేశ్‌రావు, ఉపాధ్యాయులు మల్లేశ్, బాలరాజు, నరసింహులు, మాధవి, యమున, జయప్రద, సీజీఆర్ ప్రతినిధులు వెంకటేశ్, బీరేశ్, లక్ష్మీప్రసన్న, నగేశ్, సుష్మ పాల్గొన్నారు.

# రూ.122 కోట్లతో మీర్‌పేట అభివృద్ధి

- మాజీ సీఎం కేసీఆర్ సహకారంతో రూ.75 కోట్లు ప్రత్యేక నిధులు తెచ్చాం
- రద్దు చేసిన రూ.50 కోట్లు తిరిగి ఇవ్వాలి
- చెరువుల సుందరీకరణకు రూ. కోటి కేటాయింపు
- మీర్‌పేట కౌన్సిల్ సమావేశంలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి




మీర్‌పేట కౌన్సిల్ సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

బడంగ్‌పేట, ఫిబ్రవరి 24 : మాజీ సీఎం కేసీఆర్ సహకారంతో మీర్‌పేట మున్సిపల్ కార్పొరేషన్‌ను రూ.122 కోట్లతో అభివృద్ధి చేశామని మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి అన్నారు. మీర్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ సమావేశం మేయర్ దుర్గా దీప్‌లాల్ చౌహాన్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఎజెండాలో ఉన్న 46 అంశాలపై సభ్యులు చర్చించారు. ఎజెండాలో ఉన్న అంశాలను సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి మాట్లాడుతూ మీర్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ అభివృద్ధికి రూ.75 కోట్ల ప్రత్యేక నిధులు తీసుకువచ్చామన్నారు. మహేశ్వరం నియోజకవర్గానికి ఒక్క రూపాయి కూడా తేలేనివారు ప్రజల మధ్యన చిచ్చు పెట్టడానికి కుట్రలు చేస్తున్నారన్నారు. పిచ్చి లెక్కలు చేస్తున్న వారి మాటలను ప్రజలు నమ్మకూడదన్నారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రజల మధ్యకు వచ్చి ప్రకటించిన నిధులను రద్దు చేయడంపై ఆమె తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ప్రజలపైన, మున్సిపల్ కార్పొరేషన్ అభివృద్ధి పైన ఏ మాత్రం చిత్తశుద్ధి ఉన్నా రద్దు చేసిన రూ.150 కోట్లను రిలీజ్ చేయాలన్నారు. బడంగ్‌పేటకు రూ.50కోట్లు, మీర్‌పేటకు రూ.50 కోట్లు, జల్‌పల్లి మున్సిపాలిటీకి రూ.25 కోట్లు, తుక్కుగూడ మున్సిపాలిటీకి రూ.25 కోట్ల ఎస్‌జీఎఫ్ నిధులు తీసుకు వచ్చామన్నారు. నిధులు తీసుకు రాలేనివారు అవిశ్వాసాలు పెట్టి గందరగోళం చేయాలని చూస్తున్నారన్నారు. మీర్‌పేట అభివృద్ధికి మేయర్ దీర్గా దీప్‌లాల్ ఏం తక్కువ చేశారని ప్రశ్నించారు. మీర్‌పేట పెద్ద చెరువు సుందరీకరణకు మరో కోటి రూపాయలు కేటాయించడం జరిగిందన్నారు. క్రీడా మైదానాల అభివృద్ధికి కోటి కేటాయించడం జరిగిందన్నారు. మూడు శ్మశాన వాటికలను అభివృద్ధి చేయిస్తామన్నారు. పట్టణ ప్రకృతి వనాలు, పల్లె ప్రకృతి వానాలతో ఎంతో ప్రగతి సాధించామన్నారు. ఫుట్‌పాత్‌ల పైన నిర్మాణాలను, బోర్డులను తొలగించాలని ఆమె అధికారులకు ఆదేశాలు జారీచేశారు. కార్యక్రమంలో మేయర్ దుర్గా దీప్‌లాల్ చౌహాన్, డిప్యూటీ మేయర్ తీగల విక్రంరెడ్డి, కమిషనర్ చంద్రశేఖర్, కార్పొరేటర్లు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

### భక్తి భావాన్ని పెంపొందించుకోవాలి

కందుకూరు. ఫిబ్రవరి 24 : ప్రతి ఒక్కరూ భక్తి భావాన్ని పెంపొందించుకోవాలని మాజీ మంత్రి ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి అన్నారు. శనివారం మండల పరిధిలోని పులిమామిడిలో గల చీకటి వేంకటేశ్వర స్వామి ఆలయం నిర్వహించిన స్వామివారి కల్యాణంలో పాల్గొని తీర్థప్రసాదాలు తీసుకున్నారు. నిర్వాహకులు ఆమెను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ బొక్క జంగారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ సురుసాని సురేందర్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు ఆనేగౌని అంజయ్యగౌడ్, ఆనేగౌని దేవీపాండుగౌడ్, మాజీ ఎంపీపీ ఆనేగౌని సంధ్య దామోదర్‌గౌడ్, ఎంపీటీసీ రాజమ్మ, యూత్ నాయకులు తాళ్ల కార్తీక్, బొక్క దీక్షిత్‌రెడ్డి, శేఖర్, భక్తులు పాల్గొన్నారు.



వేంకటేశ్వర స్వామి ఆలయంలో నిర్వహించిన కల్యాణంలో పాల్గొన్న ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి



పరీక్షల నిర్వహణపై సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ భూపాల్‌రెడ్డి

## పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

**రంగారెడ్డిజిల్లా అదనపు కలెక్టర్ భూపాల్‌రెడ్డి**

షాబాద్, ఫిబ్రవరి 24 : పదో తరగతి పరీక్షలు పకడ్బందీగా, సజావుగా నిర్వహించేందుకు సంబంధిత శాఖల అధికారులు అన్ని చర్యలు తీసుకోవాలని రంగారెడ్డిజిల్లా అదనపు కలెక్టర్ భూపాల్‌రెడ్డి తెలిపారు. శనివారం జిల్లా సమీకృత కార్యాలయ సముదాయ భవనంలోని సమావేశ మందిరంలో పదో తరగతి పరీక్షల నిర్వహణపై వివిధ శాఖల అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పదో తరగతి పరీక్షలను ఎటువంటి సమస్యలు తలెత్తకుండా నిర్వహించాలని సూచించారు. మార్చి 18 నుంచి ఏప్రిల్ 2 వరకు ఉదయం 9:30 నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లాలో 237 పరీక్ష కేంద్రాల్లో 50,946 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. ప్రశ్నాపత్రాలను భద్రపరిచేందుకు 37 పోలీస్ స్టేషన్లను గుర్తించినట్లు తెలిపారు. పరీక్ష కేంద్రాల్లోకి మొబైల్స్, వాచ్, ఎలక్ట్రానిక్ వస్తువులను అనుమతించకూడదని చెప్పారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధించి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని తెలిపారు. పరీక్ష కేంద్రాల సమీపంలో జిరాక్స్ కేంద్రాలను మూసివేయించాలని సూచించారు. పరీక్ష కేంద్రం వద్ద అత్యవసర మందులతో పాటు ఆశావర్కర్, ఏఎన్‌ఎంలను సిబ్బంది నియమించాలని వైద్యారోగ్యశాఖ అధికారికి సూచించారు. ఫర్నిచర్, తాగునీరు, విద్యుత్ సౌకర్యం, టాయిలెట్లు, ఫ్యాను ఉండేలా ముందస్తుగా చర్యలు తీసుకోవాలన్నారు. పరీక్ష సమయాలను దృష్టిలో పెట్టుకుని బస్సులను నడిపించాలని ఆర్టీసీ అధికారులకు సూచించారు. పరీక్షలు జరిగే సమయంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడకుండా చూడాలని ట్రాన్స్‌కో అధికారులను ఆదేశించారు. నిర్ణీత సమయానికి సకాలంలో ప్రశ్నాపత్రాలు కేంద్రాలకు చేరాలన్నారు. పరీక్షలు ప్రారంభం అయ్యే సమయానికి ముందే విద్యార్థులు తమకు కేటాయించబడిన పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. ఎప్పటికప్పుడూ పరీక్ష కేంద్రాలను తనిఖీ చేసేందుకు వీలుగా ఫ్లయింగ్ స్క్వాడ్, సిట్టింగ్ స్క్వాడ్‌లను నియమించినట్లు చెప్పారు. అధికారులందరూ సమన్వయంతో పనిచేసి పరీక్షలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో డీఐఈవో శ్రీదేవి, జిల్లా విద్యాశాఖ అధికారి సుశీందర్‌రావు, పోలీసు, ఆరోగ్య, ఆర్టీసీ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని భూపాల్‌రెడ్డి తెలిపారు. శనివారం రంగారెడ్డిజిల్లా కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణపై సంబంధిత శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఫిబ్రవరి 28 నుంచి మార్చి 19 వరకు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జిల్లాలో 195 పరీక్ష కేంద్రాల్లో ఇంటర్ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇంటర్ పరీక్షలో మొదటి సంవత్సరానికి సంబంధించి 74,875 మంది, ద్వితీయ సంవత్సరానికి 74,191 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నట్లు తెలిపారు.



### మతసామరస్యం

పెద్దేముల్ : మండల పరిధిలోని గాజీపూర్ గ్రామానికి చెందిన ఖాజాబాయ్ ఓ పానీ పూరి దుకాణాన్ని నడిపించుకొంటూ తన జీవనాన్ని కొనసాగిస్తూ సమయం దొరికినప్పుడల్లా సామాజిక కార్యక్రమాలు, నిరుపేదలకు అన్నదాన కార్యక్రమాలను నిర్వహించేవాడు. ఈ క్రమంలో ఇందోల్ గ్రామంలో పలువురు శివదీక్షను చేపట్టగా.. వారికి తాను స్వయంగా వండిన పాయసాన్ని వడ్డించి వారితో కలిసి స్వీకరించాడు. ఈ సందర్భంగా శివస్వాములు ఆయనకు ధన్యవాదాలు తెలిపారు.